



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వికారాబాద్‌లోని బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కీసర గుట్టపై శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



చీర్యాల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు

కార్తీక శోభ

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

జిల్లా వ్యాప్తంగా కార్తీకపౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఈ నేపథ్యంలో ముందుగానే ఆలయాలను విద్యుద్దీపాలు, పూలు, మామిడి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు ఆలయాలకు వెళ్లి తమ ఇష్టదైవాలను దర్శించుకొని దీపారాధన చేశారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు 5

నేడు వికారాబాద్‌లో 11వ జోనల్ మీట్

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనంతగిరిపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో రేపటి (6వతేదీ) నుంచి 8వ తేదీ వరకు 11వ జోనల్ మీట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం జోనల్ మీట్ ప్రారంభోత్సవానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల, పరిగి ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ డి.రమాదేవి తెలిపారు. ఇన్‌డోర్, ఔట్‌డోర్ క్రీడా పోటీలకు 1,200 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు ఆమె వివరించారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారి వెంకయ్య

బొంరాస్‌పేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రుమళ్ల కాకరవాణి ప్రాజెక్టులో స్థానిక నాయకులతో కలిసి ఆయన 1,91,000 చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, గ్రామ అధ్యక్షుడు రాములు, లక్ష్మయ్య, శ్రీశైలం, అంజి, వెంకటయ్య, లక్ష్మయ్య, నర్సిములు, గిరి, వెంకట్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఈ పాపం ఎవరిదీ?

హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి మృత్యు కుహరంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ దుర్ఘటనల్లో అనేక మంది తమ ప్రాణాలను పోగొట్టుకొంటున్నారు. దీంతో వారి కుటుంబాలకు తీరని శోకం మిగులుతోంది. అసలు ఈ పాపానికి కారణం ఎవరు? వారి గుండెకోతకు బాధ్యులెవరు? ఇన్ని ఘోర ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు, అధికారులకు పట్టింపు లేదా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక నేతల నిర్లక్ష్యం కారణంగానే హైవే విస్తరణ పనులు ముందుకు సాగడం లేదని విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి తరచూ ఇదే రహదారి నుంచి వెళ్తుంటారు. సీఎం వెళ్లే రోడ్డు దుస్థితే ఇలా ఉంటే.. రాష్ట్రంలోని మిగతా రహదారుల పరిస్థితి ఏమిటని స్థానికులు నిలదీస్తున్నారు.



ఇరువైపుల భారీ వృక్షాలతో బీజాపూర్ హైవే, మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)



హైదరాబాద్ - బీజాపూర్ హైవే పనులకు వృక్షాలే అడ్డంకా?

- ఈ ప్రాంత నేతలు, అధికారులకు బాధ్యతేదీ?
- సీఎం తరచూ వెళ్లే రహదారికి మరమ్మతులు ఎందుకు చేయడం లేదు?
- నిర్మాణ పనులను కాంట్రాక్ట్ సంస్థ ఎందుకు నిలిపివేసింది?
- ఓ రాజకీయ నేత బెదిరింపులేనంటూ గతంలో ప్రచారం
- ఇంకెంత మందిని చంపుతారంటున్న స్థానికుల ప్రశ్నలకు సమాధానాలేవీ?
- ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్న నేతలు

6

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : హైదరాబాద్ నగర శివార్లలోని మీర్జాగూడ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న ఈ దుర్ఘటనలో 19 మంది మృతి చెందగా 34 మంది గాయాలపాలైన సంగతి తెలిసిందే. నగర శివార్లలో ఇంత ఘోర ప్రమా దం జరిగిన దాఖలాల్లేవు. ఈ ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాలను ఛిద్రం చేసింది. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ. తల్లి, తండ్రి

మిగతా 7వ పేజీలో...

పూడూరులో క్రికెటర్ సిరాజ్ సందడి

భూరిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి రాక



సిరాజ్‌కు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ వెంకటయ్య

పూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ క్రికెటర్, డీఎస్పీ మహ్మద్ సిరాజ్ బుధవారం పూడూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. పూడూరు మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతల్ గ్రామంలో ఇటీవల ఆయన 2.35 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ నిమిత్తం ఆయన పూడూరు వచ్చారు. సిరాజ్ రాకతో మండల కేంద్రంలో సందడి వాతావరణం నెలకొంది. క్రికెటర్‌ను చూసేందుకు స్థానిక యువకులు తహసీల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటయ్య పూలమాలలు, శాలువాతో సిరాజ్‌ను సన్మానించారు.

కల్యాణ వైభోగం

కనుల పండువగా రథోత్సవం



కల్యాణం తంతు నిర్వహిస్తున్న అర్చకులు

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు రాత్రికి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. కాగా, ఆలయ పరిసరాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. శని, ఆదివారాలు పెద్ద సంఖ్యలో భక్తులు అనంతపద్మనాభ స్వామిని దర్శించుకోనున్నారు. వికారాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇబ్బందులు తలెత్తకుండా వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. అలాగే స్వామి వారిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య దర్శించుకున్నారు.



లబ్ధిదారులకు ట్రాన్స్‌ఫార్మర్లను అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, స్థానిక నేతలు

విద్యుత్ శాఖలోనూ మొబైల్ వాహనాలు

- సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు
- అప్పా జంక్షన్ వరకు రోడ్డు పూర్తికి చర్యలు
- పరిగితో మా కుటుంబానికి ప్రత్యేక అనుబంధం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు

పరిగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో మాదిరిగా విద్యుత్‌శాఖలో మొబైల్ వాహనాలను తీసుకొస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎక్కడ, ఎలాంటి విద్యుత్ సమస్య వచ్చినా మొబైల్ వాహనాల ద్వారా సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ అందుబాటులో ఉంటే పరిశ్రమలు, అనుబంధ రంగాలు అభివృద్ధి చెంది యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. బుధవారం పరిగిలో రూ.788 కోట్లు విలువ చేసే 400కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, అలాగే మరో తొమ్మిది 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శంకుస్థాపనలు, 220/133 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం రూ.8 కోట్ల విలువ చేసే విద్యుత్ సామగ్రిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మినీస్టేడియంలో మూడు ఓపెన్ జిమ్ కేంద్రాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం పరిగిలోని ఏబీఎస్ ప్లాజాలో జరిగిన సభలో భట్టి మాట్లాడారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా కుటుంబ ప్రయోజనాలే ముఖ్యంగా వనరులను దోపిడీ చేసిందని ఆరోపించారు. ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఉన్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుద్ పరంగా ఎంతో ప్రగతిని సాధించామని, అందువల్ల థర్మల్‌పవర్ ప్రాజెక్టులే కాకుండా సోలార్

మిగతా 8వ పేజీలో...

సూపర్ మూన్





శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో..

కార్తీక పర్వదినాన బుధవారం రాత్రి ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బీవర్ సూపర్ మూన్ అని పిలిచే ఈ ఘట్టంలో చంద్రుడు భూమికి అత్యంత దగ్గరగా దర్శనమిచ్చాడు. సుమారు 28,000 కిలోమీటర్ల దూరంలో భూమికి దగ్గరకు చేరుకున్నాడు. ఈ దృశ్యం సాధారణం కంటే 14 శాతం పెద్దగా, 30శాతం ఎక్కువ కాంతివంతంగా దర్శనమిచ్చాడు. ఈ అపురూప దృశ్యాన్ని జిల్లా వాసులు చూసి తరించారు.

-ఆంధ్రజ్యోతి రంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కులు అందజేత
- తల్లిదండ్రులు కోల్పోయిన బాలికల బాధ్యత తీసుకుంటా: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

6

పీఎంశ్రీ నిధులు గోవిందా!

- పలువురు హెచ్ఎంల ఇష్టారాజ్యం
- దొంగ బిల్లులతో స్వాహా
- పనులు చేయకుండానే సొంత ఖాతాల్లోకి..
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- కలగానే మిగిలిపోతున్న పాఠశాలల అభివృద్ధి



మేడ్చల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రవేశపెట్టింది. పేద విద్యార్థుల ఉన్నతితో పాటు పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంతటి మంచి ఆశయాన్ని ఆచరణలో అమలు చేయాల్సిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలువురు ప్రధానోపాధ్యాయులు దొంగ బిల్లులతో పీఎంశ్రీ నిధులను కాజేస్తుండటం గమనార్హం. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవరిస్తున్నారు.

ఏడాదికి రూ. 20 లక్షల చొప్పున

జిల్లా వ్యాప్తంగా పీఎంశ్రీ పథకం కింద 25 పాఠశాలలు ఎంపికయ్యాయి. 2023-24 ఫేజ్-1 కింద, 2024-25 ఫేజ్-2లో కలిసి మొత్తం 25 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ నిధులను స్కూల్ అభివృద్ధికి వెచ్చించాల్సి ఉంటుంది. ఇందుకుగాను ఒక్కో పాఠశాలకు ఏడాదికి రూ.20 లక్షల చొప్పున 5 సంవత్సరాల్లో కోటి రూపాయలు విడుదల అవుతాయి. నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఈ నిధులను ఖర్చు

మిగతా 8వ పేజీలో...

కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి..


నిజాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ నిధులను ఏకంగా తన కుంటుంబ సభ్యులు(భార్య, కుమారులు) ఖాతాల్లోకి మళ్లించడం జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది. సదరు ప్రధానోపాధ్యాయుడు ఏకంగా రూ. 6.24లక్షలను కుటుంబసభ్యుల ఖాతాల్లోకి మళ్లించాడు. పీఎంశ్రీ నిధులతో పాటు సీసీహెచ్ వర్కర్స్(మధ్యాహ్న భోజన కార్మికులు) పేరుతో సైతం నిధులను మింగేస్తున్నాడు. సీసీహెచ్ వర్కర్లల్లో ఒకరిగా సదరు ప్రధానోపాధ్యాయుడు ఏకంగా తన పేరును కూడా నమోదు చేసుకోవడం పట్ల తీవ్ర విమర్శలకు దారితీసింది.






















చిన్నారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

పరిహారం చెక్కులు అందజేసిన అధికారులు

తల్లిద్రండులు కోల్పోయిన బాలికల బాధ్యత తీసుకుంటా

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు,యాలాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాల ఇళ్ల వద్దకు అదనపు కలెక్టర్ సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌తో కలిసి వెళ్లి ప్రభుత్వం తరుపున రూ.7లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనాథలైన హాజీపూర్‌కు చెందిన ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటానని, అలాగే వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల గ్రామమైన పేర్కంపల్లికి వెళ్లి వారి తండ్రి ఎల్లయ్యగౌడ్‌కు చెక్కును అందజేశారు. లక్ష్మీనారాయణపూర్ మృతి చెందిన అఖిలారెడ్డి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఇందిరమ్మ కాలనీ, గౌతాపూర్, వాల్మీకినగర్, బృందావన్ కాలనీలో మృతుల కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శించడంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత, డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

తేమశాతం పేరుతో రైతులను వేధించొద్దు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల/ఇబ్రహీంపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తేమశాతం పేరుతో అన్నదాతలను వేధింపులకు గురిచేయవద్దని, ఆఖరి గింజ వరకు కొనుగోళ్లు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం ఆయన మంచాలలో, ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డుల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఏసీపీ రాజు, ఎంపీడీవో బాలశంకర్ సీఐ మధు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ సుజాత, అడిషనల్ డీఆర్డీవో జోయప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోష్ కుమార్, డీపీఎంలు జయశ్రీ, యాదయ్య, ఏపీఎం బాలశివుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రగతిని కాంక్షించే వారు కాంగ్రెస్‌తో కలిసిరావాలని కోరారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ, కల్వకుర్తి మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యూసుఫ్ గూడలోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్, మండ్లీ రాములు, నర్సింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి, జక్కు అనంత రెడ్డి, గుర్రం కేశవులు, కృష్ణానాయక్, శ్రీశైలం, కాను శ్రీనివాస్ రెడ్డి, డోకూరు ప్రభాకర్ రెడ్డి, హన్మనాయక్, లక్పతి నాయక్, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, బీచ్యనాయక్, చేగూరి వెంకటేశ్, హీరాసింగ్, సాయిరెడ్డి, కొండల్ రెడ్డి, రమేశ్‌గౌడ్, మిట్టపల్లి అంజయ్య పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి సేవలకు అంతర్జాతీయ ఖ్యాతి

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీగా, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా నారా భువనేశ్వరి చేస్తున్న సేవలకు అంతర్జాతీయ ఖ్యాతి లభించిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో చేసిన సేవలకు డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డును, హెరిటేజ్ ఫుడ్స్ ఎండీగా చేసిన సేవకు గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకున్నారని తెలిపారు. లండన్‌లోని మే ఫెయిర్ హోలులో ఐఓడీ సంస్థ నుంచి రెండు ప్రతిష్టాత్మక అవార్డులను నారా భువనేశ్వరి అందుకున్నారని తెలిపారు. ఒక వైపు అంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, అవినీతి రహిత పాలనను అందిస్తూ ఆదర్శనేతగా గుర్తింపు పొందుతుంటే, మరో వైపు ఆయన సతీమణి నారా భువనేశ్వరి చేస్తున్న సామాజిక సేవలకు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డు రావడం తెలుగు దేశం పార్టీలో నూతనోత్సవాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో చాంపియన్‌గా 'రంగారెడ్డి'


ఫుట్‌బాల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (ఎస్‌జీఎఫ్) అండర్ -14 బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. బాలికల విభాగంలో మెదక్ జిల్లా జట్టు మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో నల్లగొండ జిల్లా జట్టు, తృతీయ స్థానంలో రంగారెడ్డి జిల్లా జట్టు నిలిచాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో హైదరాబాద్ జిల్లా జట్టు, తృతీయ స్థానంలో ఖమ్మం జిల్లా జట్టు నిలిచాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల జట్ల నుంచి రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతయ్య కప్‌లను అందజేశారు. ఈ పోటీల్లో బాలుర జట్ల పరిశీలకులుగా శ్రీనివాస్, బాలికల జట్ల పరిశీలకులుగా వడ్డెన్న వ్యవహరించారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఎంఈవో బాబుసింగ్, జిల్లా క్రీడా ఉపాధ్యాయులు క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లు కల్పించడంలో సహకారం అందించారు.

ప్రమాదకరంగా బీజాపూర్ హైవేపై మలుపు



ఈ పాపం ఎవరిదీ?

(ఐదో పేజీ తరువాయి)

చనిపోయి కొందరు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. మరికొందరు తల్లిదండ్రులు పిల్లలందరినీ కోల్పోయి తీవ్ర గుండెకోతతో విలవిల్లాడుతున్నారు. కుటుంబానికి ఆధారమైన వారిని కోల్పోయి మరికొందరు దిక్కులేని వారయ్యారు. కొన్నాళ్లుగా అసలు మరమ్మతులకే నోచుకోకుండా ఉన్న గుంతలు, మలుపులమయంగా మారిన ఈ రహదారి వల్లే ఈ ప్రమాద ఘటన చోటు చేసుకుంది. ఇదే కాదు... కొన్నాళ్లుగా ఈ రహదారి మృత్యుకుహరంగా మారి నిత్యం అనేక మంది ప్రాణాలు తీస్తూనే ఉంది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కూడా గతంలో అనేక ప్రత్యేక కథనాలు కూడా ప్రచురించింది. ఎన్నేళ్ల కిందట జాతీయ రహదారిగా మారిన ఈ హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో పాటు అసలు మరమ్మతులకు నోచుకోకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఈ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు కారకులెవరూ..? ఏటా పదుల సంఖ్యలో జరుగుతున్న ప్రమాదాల కారణంగా అనేకమంది మృత్యువాత పడి వారి కుటుంబాలకు గుండెకోత మిగలడానికి బాధ్యులెవరూ? ఈ పాపం ఎవరిదీ? అని జనం ప్రశ్నిస్తున్నారు.

పదేళ్లుగా అడ్డంకులు

హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణకు 2015లో ఆమోదం లభించినప్పటికీ పదేళ్లైనా ఈ పనులు 25శాతం కూడా పూర్తి కాలేదు. విస్తరణ పనులకు కేంద్రం మొత్తం రూ.956 కోట్ల నిధులు విడుదల చేసింది. ఔటర్ రింగురోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46కి.మీ మేర నాలుగు లేన్ల రహదారి విస్తరణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను 'మేఘా' ఇన్‌ఫ్రా సంస్థ రూ.786 కోట్లకు దక్కించుకుని రోడ్డు విస్తరణ మొదలు పెట్టింది. దాదాపు భూసేకరణ పూర్తయి కొన్నిచోట్ల పనులు మొదలైనప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు తొలగిస్తున్నారంటూ పర్యావరణ వేత్తలు హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ను ఆశ్రయించారు. దీంతో ఈ పనులన్నీ ఎక్కడిక్కడే ఆగిపోయాయి. మరోవైపు రోడ్డు నిర్మాణ సంస్థ కొంత నిర్మాణ సామగ్రిని కూడా ఇక్కడ నుంచి తరలించింది. అయితే ఇటీవల 765 మర్రి వృక్షాలను రక్షించేలా అలైన్‌మెంట్ మార్పు చేసి మరో 150 వృక్షాలను రీలోకేట్ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో సేవ్ బనియన్స్ సంస్థకు చెందిన పర్యావరణ వేత్తలు కేసు విత్ డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్జీటీ గత నెల 31న స్టే ఎత్తివేసి పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

స్థానిక నేతలపై ప్రజాగ్రహం

మీర్జాగూడ రోడ్డు ప్రమాద ఘటన తరువాత బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఆయా పార్టీల నేతలను స్థానికులు గట్టిగానే నిలదీశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డితో పాటు స్థానిక ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యను అడ్డుకునే యత్నం చేశారు. 'రోడ్లు ఇంత అధ్వానంగా ఉంటే ఇన్నాళ్లు మీరేమి చేస్తున్నారు?.. మీ వల్ల మాకు దుర్గతి పట్టిందని" జనం నిలదీయడంతో పాటు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అయితే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో నేతలు వివరణ ఇచ్చుకునే యత్నాలు చేస్తున్నారు. ఈ పాపం మాది కాదు... అవతల పార్టీ వారిదంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ఈ పాపం మాది కాదు... ఫలానా పార్టీ వారిదంటున్నారు. ఇలా స్థానిక నేతలు తమ బాధ్యతలేనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో రోడ్డు రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన మహేందర్‌రెడ్డి ఈ ప్రాంతం నుంచే ప్రాతినిథ్యం వహించినా ఈ రోడ్డు మరమ్మతుల విషయాన్ని ఆయన పెద్దగా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. అలాగే గ్రీన్‌ట్రిబ్యునల్ కేసుల కారణంగానే రోడ్డు విస్తరణ పనులు జాప్యమవుతున్నాయని నేతలు చెబుతున్నారు. కానీ ఈ రోడ్డు విస్తరణ పనుల్లో గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు ఒక్కటే కారణం కాదనే విమర్శలు ఉన్నాయి. ఇది నిజమైతే పదేళ్లుగా ఈ సమస్యను ప్రభుత్వాలు ఎందుకు పరిష్కరించలేకపోయాయి..? లోపం ఎక్కడ ఉంది..? ఇది అంతు చిక్కని వ్యవహారం. ఇదిలా ఉంటే కోర్టు కేసుకు ముందు పనులు మొదలైన సమయంలో ఓ స్థానిక నేత కాంట్రాక్టర్‌ను ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో గత ఎన్నికలకు ముందు నిర్మాణ సంస్థ భారీగా తెచ్చిపెట్టిన నిర్మాణ సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించిందని ప్రచారం జరిగింది.

తరచూ సీఎం వెళ్లే రహదారే ఇలా ఉంటే..

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి వెళ్లేందుకు ఆయన తరచూ ఇదే రహదారిలో వెళుతుంటారు. అయినా ఈ రహదారి విస్తరణ సంగతి దేవుడెరుగు కనీసం మరమ్మతులకు నోచుకోవడం లేదు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ రోడ్డు విస్తరణ పనులను సమీక్షించి త్వరగా పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో ఢిల్లీ వెళ్లి కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కారీని కలిశారు. అయితే తరువాత దీన్ని సరిగా ఎవరూ పట్టించుకోలేదు. కోర్టు కేసులు ఉండి రహదారి విస్తరణ పనులు ఆగిపోతే నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై ఉన్న గుంతలు పూడ్చడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎందుకు చొరవచూపడం లేదు. సీఎం వెళ్లే రహదారికే ఈ దుస్థితి ఉంటే.. స్థానిక ప్రజలు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

కోలుకుంటున్న క్షతగాత్రులు

చేవెళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో జరిగిన క్షతగాత్రులు చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. మూడు రోజులుగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. బుధవారం సైతం క్షతగాత్రులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రిలో మొత్తం 13 మంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. ఇందులో ఎవరికీ కూడా ప్రమాదం లేదని, వైద్యులు స్పష్టం చేశారు. వారందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు స్పష్టం చేశారు.



చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో కోలుకుంటున్న క్షతగాత్రులు



తాండూరులో కొవ్వొత్తుల ర్యాలీ

నివాళులర్పిస్తున్న తాండూరు ప్రజలు

మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తాండూరుకు చెందిన 13 మంది దుర్మరణం చెందిన ఘటనపై బుధవారం పట్టణ పౌరసమాజం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నుంచి ఇందిరా చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

- తాండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి)

కీసరగుట్టకు పోటెత్తిన భక్తజనం



రామలింగేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర/కీసర రూరల్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కీసరగుట్ట రామలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం భక్తులు భారీ సంఖ్యలో రావడంతో ఆలయ నిర్వాహకులు తెల్లవారుజాము నుంచే అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి దర్శనాల కోసం భక్తులు క్యూలో వేచి ఉన్నారు. రద్దీని బట్టి స్థానికులకు, సిఫారసు చేసిన వారిని నిలిపివేశారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, ఆలయం వెలుపల ఉన్న శివలింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ మహా మండపంలో దీపోత్సవం, ఆలయ ధ్వజ స్తంభం వద్ద జ్వాలాతోరణం కనుల పండువగా సాగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్వామివారిని దర్శించుకొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కీసర రామలింగేశ్వర స్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సతీమణి సుధాదేవ్ వర్మ దర్శించుకున్నారు.

సమూహిక సత్యనారాయణ వ్రతాలు

సంకల్ప సిద్ధిగా పేరుగాంచిన చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున్న భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు మల్లారపు లక్ష్మీనారాయణ, శ్రీహరిగౌడ్ విడతల వారీగా వ్రతాలకు అనుమతి ఇచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.



బుగ్గజాతరలో కార్తీక స్నానాలు ఆచరించడానికి తరలివచ్చిన భక్తులు

బుగ్గ జాతరకు కార్తీక శోభ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, నవంబర్ 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీ శ్రీ బుగ్గరామలింగేశ్వర క్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి బుధవారం తెల్లవారు నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చి కుటుంబ సమేతంగా పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే

ప్రజలంతా పాడిపంటలతో సభిక్షంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గక్షేత్రంలో నూతనంగా నిర్మించిన లడ్డూ ప్రసాద వితరణ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఘనంగా జ్వాలా తోరణం



ఘట్‌కేసర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరి నవశక్తి దేవాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, పూజారి శివకుమార్ శర్మ, ప్రసాద్, పాశం హన్మంత్‌రెడ్డి, వీరేశం, సుధాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, డీజీ నాయక్, రమేష్, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాగ్నాకు గంగా హారతి



తాండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలోని కాగ్నా నది వంతెన పక్కన కార్తీక పౌర్ణమి గంగా హారతిని ఘనంగా నిర్వహించారు. వినాయక ఉత్సవ సమితి, వేద బ్రహ్మణ, తాండూరు బ్రహ్మణ అర్చక పురోహిత సంఘం పర్యవేక్షణలో గంగా హారతి నిర్వహించారు. సాయంత్రం జరిగిన ఈ హారతి కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గంగలో హారితిని వదిలారు. వేద బ్రహ్మణులు గంగా హారతి ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణ వేత్త డాక్టర్ బాబురావు

ఫార్మాసిటీని రద్దు చేయాల్సిందే..

కార్పొరేట్ శక్తులకు అండగా ప్రభుత్వాలు.. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

యాచారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కోసం గత ప్రభుత్వం పేదల భూములు తీసుకొని వారిని రోడ్డున పడేసిందని, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఫార్మాసిటీని రద్దు చేయకుండా మోసం చేసిందని ప్రముఖ పర్యావరణ వేత్త డాక్టర్‌బాబురావు, ప్రముఖ జర్నలిస్టు పాశంయాదగిరి ఆరోపించారు. ఏది మేమైనా విషతుల్యమైన ఫార్మాసిటీని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఫార్మాసిటీ పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వాల అన్యాయం ఇంకెన్నాళ్లు, రైతులకిచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్, తదితర అంశాలపై పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చటి పొలాల మధ్య ఫార్మా కంపెనీల ఏర్పాటుకు పేదల భూములు తీసుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటున్నాయని విమర్శించారు. మా భూములు తీసుకోరాదని ఆనాడు సర్పంచులు, ఎంపీటీసీలు డిమాండ్ చేసినా ఆనాటి ప్రభుత్వం ఫార్మాసిటీకి భూములు తీసుకోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఎందుకు నిలుపుకోలేదని ప్రశ్నించారు. ఏకంగా 2,500 ఎకరాలను నిషేదిత జాబితాలో పెట్టి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా నిషేదం విధించడం దారుణమన్నారు. రైతులు, యువత, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు కలిసి పోరాటాలు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఫ్యూచర్‌సిటీ పేరుతో మరిన్ని భూములు తీసుకోవడం సమంజసం కాదన్నారు. నిషేదిత జాబితాలో ఉన్న భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో పండుతున్న వరి, పత్తి ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిషేదం విధించడం దారుణమన్నారు. సమావేశంలో వి.సంధ్య, బండారి లక్ష్మయ్య, కన్నెగంటి రవి, డాక్టర్ బాబురావు, ఆర్.వెంకటరెడ్డి., ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కవుల సరస్వతి, గణేష్, సందీప్‌రెడ్డి, యుగందర్ రెడ్డి, అనసూయ, బర్లమల్లేష్, దేవోజీ పాల్గొన్నారు.

మీర్జాగూడ ఘటన నేపథ్యంలో రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటికైనా మేల్కొని పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే సేవ్ తాండూరు పేరిట తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నారు. తాండూరు నియోజకవర్గానికి బీటీ పనుల నిమిత్తం సుమారు రూ.300 కోట్లు మంజూరైనా కొన్నిచోట్ల పనులే ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ప్రమాదాలు జరుగుతున్నా..

పట్టించుకోరా?

రహదారుల నిర్మాణాలపై కాంట్రాక్టర్ల అలసత్వం!



తాండూరు - పెద్దేముల్ రోడ్డు మార్గంలో గుంతలమయంగా రోడ్డు



ధర్నా చేస్తున్న తాండూరు ప్రజలు(ఫైల్)



యాలాల రోడ్డుపై వెయిట్ మిక్స్ వేస్తున్న దృశ్యం

- మంత్రి మందలించినా నత్త నడకనే..
- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- రోడ్ల కోసం రోడ్డెక్కుతున్న ప్రజలు
- 'సేవ్ తాండూరు' పేరుతో మొదలైన ఉద్యమం
- మీర్జాగూడ ఘటనతో యాలాల రోడ్డుకు మరమ్మతులు

తాండూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తాండూరు - వికారాబాద్ రోడ్డు పనుల నిమిత్తం సుమారు రూ.100 కోట్లతో టెండర్ దక్కించుకున్న ఒక ఏజెన్సీ సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. ప్రధాన రోడ్డు మార్గమైన తాండూరు - వికారాబాద్ పనులు ప్రారంభం చేయించేందుకు పాలకులు, అధికారులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. రోడ్డు తవ్వి వదిలేసిన తర్వాత చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. సోషల్ మిడియా, పత్రికల్లో కథనాలు, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఒత్తిడితో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డివెంకట్‌రెడ్డి సెప్టెంబర్ 7న పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో నెల తర్వాత ఖాంజాపూర్ నుంచి కందనెల్లి వరకు వికారాబాద్ రోడ్డు పనులు ప్రారంభించారు. అయితే ఈ పనులు కూడా నత్తనడకగానే సాగుతున్నాయి.

ప్రజాగ్రహం.. పనులు మొదలు

సదరు కాంట్రాక్టర్‌కు రాజకీయ అండదండలు, పర్సంటేజీలు, బంధుఘనం ఉండడంతో ఎప్పుడు పనులు చేపట్టినా ఎవరూ ఏమి అనలేని పరిస్థి ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గుత్తేదారులు స్పందించక తప్పడం లేదు. ఇన్నాళ్లు సోయి లేకుండా వ్యవహరించిన ఆర్అండ్‌బీ సిబ్బంది బుధవారం లక్ష్మీనారాయణపూర్ నుంచి యలాల వెళ్లే దారిలో గుంతలపై వెయిట్ మిక్స్ పోయించడం చర్చనీయమైంది. తాండూరు - పెద్దేముల్ రోడ్డు కోసం గాజీపూర్ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. గతంలో ఆర్అండ్‌బి శాఖలో గ్యాంగ్‌మెన్‌లు రోడ్ల గుంతలను తాత్కాలికంగా పూడ్చివేసేవారు. ఇప్పుడు వారు లేకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పాడినా పట్టించుకునే వారే లేరు.

నిలిచిన రోడ్డు పనులివే..

- తాండూరు బస్టాండ్ నుంచి సెయింట్ మార్క్స్ హైస్కూల్ వరకు నాలుగు కి.మీ బీటీ రోడ్డు నాలుగు లేన్లుగా మార్చేందుకు రూ.25 కోట్లు మంజూరు చేశారు. డిసెంబర్ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉండగా రూ.2 కోట్ల మేరకు మాత్రమే పనులు పూర్తి చేశారు.
- గౌతాపూర్ నుంచి కరన్‌కోట్ వరకు ఐదు కి.మీ. రూ.8 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు చేయాల్సి ఉండగా అగ్రిమెంట్ గడువు పూర్తయినా పనులు ముందుకు సాగడం లేదు.
- తాండూరు కోట్‌పల్లి మార్గంలోని అంతారం నుంచి పెద్దేముల్ వరకు 9కి.మీకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ పనులు తన వల్ల కాదని కాంట్రాక్టర్ రాత పూర్వకంగా అధికారులకు తెలిపినట్లు సమాచారం.
- అగ్గనూర్ - బషీరాబాద్ ప్లాంట్ గ్రాంట్ కింద బషీరాబాద్ - మైల్వార్‌కు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు చురుగ్గా సాగడం లేదు. బషీరాబాద్, మైల్వార్ రోడ్లకు టెండర్ ప్రక్రియ పూర్తి కాగా, అగ్గనూర్ - బషీరాబాద్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- బషీరాబాద్ - కరన్‌కోట్ డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదు.

అధ్వాన రోడ్లకు నిధులు నిల్

యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి దేవనూర్(12 కి.మీ.), పెద్దేముల్ మండలం మారేపల్లి నుంచి మదనంతపూర్(13 కి.మీ.) తాండూరు నుంచి యాలాల మండలం బాగాయిపల్లికి (10 కి.మీ) రోడ్లు, కోకట్ వద్ద కొత్త వంతెన నిర్మాణానికి రూ.220 కోట్లతో ప్రభుత్వానికి ప్రాతిపాదనలు పంపించారు. ఈ పనులకు ఇంకా నిధులు మంజూరు కాలేదు.

ప్రమాదకరంగా బారీకేడ్లు

తాండూరు - కోడంగల్ రోడ్డు మార్గంలోని కాగ్నా నది బ్రిడ్జిపై పడిన భారీ రంధ్రాన్ని జూలైలో ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ పూడ్చివేశారు. అయితే అప్పుడు పెట్టిన బారికేడ్లు తొలగించలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో ఎక్కువ వాహనాలు ఈ రోడ్డు మార్గంలో వెళ్తుంటాయి. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

రెండేళ్లుగా పనులకు బ్రేక్

తాండూరు పట్టణం పోలీస్‌స్టేషన్ నుంచి సాయిపూర్ తాతగుడి మీదుగా హైదరాబాద్ ప్రధాన రోడ్డుకు కలిపే సీసీ, బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. టఫ్ ఐడీసీ కింద రెండేళ్ల క్రితం రూ.3 కోట్లు మంజూరు కాగా 3 కి.మీ రోడ్డు వేయాల్సి ఉంది. ఇందులో పోలీస్ స్టేషన్ నుంచి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వరకు సుమారు రూ.కోటితో సీసీ రోడ్డు వేశారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నుంచి సాయిపూర్ హనుమాన్ దేవాలయం వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. తిరిగి అక్కడి నుంచి తాత గుడి మీదుగా కట్టమైసమ్మ ఆలయం నుంచి అయోధ్యనగర్ కాలనీల మధ్య హైదరాబాద్ రోడ్డును కలుపుతూ రూ.2 కోట్లతో బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. అయితే రెండేళ్ల క్రితం ఆ రోడ్డుపై కంకర పరిచి పైన ఎర్రమట్టి వేసి కాంట్రాక్టర్ వదిలేశాడు. దీంతో ఈ రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.



తాండూరు అయోధ్యనగర్ కాలనీలో దుస్థితి

కార్తీక శోభ

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఉపవాస దీక్షలు చేపట్టి సాయంత్రం దీక్షలు వదిలిపెట్టారు. పలువురు సత్యనారాయణ వ్రతాలు, నోములు చేశారు. రాత్రి సమయంలో మహిళలు తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు 5


బషీరాబాద్ మండలం మంతట్టి గ్రామంలో లక్షదీపోత్సవంలో మహిళలు


కొడంగల్: శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మున్సిపల్ మాజీచైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి దంపతులు


దుద్యాల: పోలెపల్లి శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు


తాండూరు: అంథ భవాని అమరేశ్వరుడి అలంకరణలో భావిగిభద్రేశ్వర స్వామి, భక్తుల దీపారాధన

శామీర్‌పేట: శ్రీభవాని రామలింగేశ్వర్ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం చేస్తున్న భక్తులు




ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని భ్రమరాంభికా మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఆలయ ధర్మకర్తలు, భక్తులు


మర్పల్లి: సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో దంపతులు


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరామ కళ్యాణ కామేశ్వరి నవ శక్తి ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


వికారాబాద్: అనంతగిరి దేవస్థానంలో ఎమ్మెల్యే యాదయ్య పూజలు


శామీర్‌పేట: శ్రీభవాని రామలింగేశ్వర్‌స్వామి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు


కులకచర్ల: పాంబండపై దీపోత్సవంలో భక్తులు


కొడంగల్: ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ


పాంబండ గిరిప్రదక్షిణలో భక్తులు

కులకచర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల పాంబండ గిరిప్రదక్షిణను బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోట్ల షైపాల్, ఈవో బాలనర్సయ్యలు ముఖ ద్వారం ఎదుట ధ్వజారోహనం చేసి గిరిప్రదక్షిణను ప్రారంభించారు. అర్చకులు దశరతం, పాండు శర్మ, అమరేందర్ శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనం కల్పించారు.

రామలింగేశ్వరుడిని దర్శించుకున్న మల్లేశ్ పటేల్

పూడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామగుండం రామలింగేశ్వరుడిని సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు మల్లేశ్ పటేల్ దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మల్లేష్ పటేల్ వెంట బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రామచంద్రం, రాఘవేందర్ ఉన్నారు.

అఖిలారెడ్డి కుటుంబానికి పరామర్శ

తాండూరు/యాలాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బస్సు ప్రమాదంలో మృతిచెందిన లక్ష్మీనారాయణపూర్‌కు చెందిన విద్యార్థిని గుర్రాల అఖిలారెడ్డి కుటుంబాన్ని ఐబీఆర్ఎం మేనేజ్మెంట్ కళాశాల సిబ్బంది జగన్నాథం, సురేష్‌లు ఓదార్చారు.

డ్రైవర్ దస్తగిరికి నివాళి

తాండూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ బస్సు ఘటనలో మృతిచెందిన డ్రైవర్ దస్తగిరికి తాండూరు బస్టాండ్‌లో బుధవారం నివాళులర్పించారు. దస్తగిరి కుటుంబానికి రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని టీజీ ఆర్టీసీ తాండూరు హైయర్ బస్ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, ముకీమ్, డ్రైవర్లు శేఖర్, రషీద్ పాల్గొన్నారు.

జేఏసీ నాయకుల అరెస్టు

బొంరాస్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల తరలింపు సరైంది కాదని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు బుధవారం పరిగిలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసేందుకు వెళ్లారు. దీంతో పోలీసులు జేఏసీ నాయకులను అదుపులోకి తీసుకొని బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చెత్త వేయొద్దని ఫ్లెక్సీల ఏర్పాటు



ఘట్‌కేసర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో చెత్త వేయొద్దని స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపాలిటీలో చెత్తకుప్పల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలు చెత్త వేయొద్దని సూచించారు. పలు కొటేషన్లతో రూపొందించిన ఈ ఫ్లెక్సీలు కాస్త ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

10న వాలీబాల్ పోటీలకు ఎంపిక

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సీనియర్ (పురుషులు/మహిళ) వాలీబాల్ జిల్లాస్థాయి ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎర్రోళ్ళ శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం ఎదులాబాద్‌లో మాట్లాడుతూ ఈనెల 10న సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 7గంటలకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 9985946311, 98489170756, 8247461381 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం

మర్పల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కోనపూరం మానయ్య(57) మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి మానయ్య కుమారుడు నవీన్ తోటి స్నేహితులు రూ.20వేలు, మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రామేశ్వర్ రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు.

విద్యుత్ శాఖలోనూ మొబైల్ వాహనాలు

(ఐదో పేజీ తరువాయి)

విద్యుత్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ అధికారులు వారానికి మూడు రోజులపాటు ప్రజాబాట చేపట్టే కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని చెప్పారు. అలాగే మన్నెగూడ- అప్పా జంక్షన్ రోడ్డు పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పరిగి నియోజకవర్గానికి తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందని భట్టి అన్నారు. తమ పెద్దన్న మల్లు అనంతరాములు రాజీవ్ గాంధీ నాయకత్వంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఉపముఖ్యమంత్రి, నాగర్‌కర్నూల్ ఎంపీగా పరిగికి సేవలు అందిచారని గుర్తు చేశారు. అలాగే మల్లు రవి కూడా పరిగి ప్రాంతానికి ఎంపీగా వ్యవహరించారన్నారు.


పరిగిలో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం

పోలీసుల తీరుపై భట్టి ఆగ్రహం

కాగా, నజీరాబాద్‌తండా శివారులో సబ్‌స్టేషన్ల శంకుస్థాపన చేస్తున్న క్రమంలో కార్యకర్తలు భారీగా తోసుకు రావడంతో తోపులాట జరిగింది. భట్టిపైకి వచ్చి తోసేలా చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్వయంగా అందరినీ అక్కడి నుంచి తోసేశారు. దీనిపై డిప్యూటీ సీఎం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పోలీసులు ఎక్కడున్నారు.. ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతుంటే తాత్సారం చేస్తున్నారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, పోలీసులు సర్ది చేప్పే ప్రయతంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

అభివృద్ధిలో అగ్రగామిగా.. : రామ్మోహన్‌రెడ్డి



గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. పరిగికి 400 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు 2013లో కృషి చేశానని, పదేళ్లలో బీఆర్ఎస్ పట్టించుకోలేదని, తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే తిరిగి శంకుస్థాసన చేసుకున్నామని తెలిపారు. పరిగిని జిల్లాలోనే అగ్రగామిగా నిలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎండీ ముషారఫ్ అలీఫారుఖీ, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, శివాజీ, జిల్లా ఎస్ఈ రవిప్రసాద్, పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీ అధ్యక్షులు బి.పరుశరాంరెడ్డి, బీఎస్ అంజనేయులు, ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్సు ప్రమాద బాధితులకు సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పీఎంశ్రీ నిధులు గోవిందా!

(ఐదో పేజీ తరువాయి)

చేయాల్సి ఉంటుంది. ఎంపికైన పాఠశాలలో మౌలిక సదుపాయాలను గుర్తించి ప్రధానోపాధ్యాయులు ఒక నివేదికను రూపొందించి డీఈవో నుంచి అనుమతి పొంది నిధులను ఎస్ఎంసీ కమిటీ ద్వారా ఖర్చులు చేయాలి. పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి సరఫరా, మధ్యాహ్న భోజనం వంటి వసతులకు మొదటగా ప్రధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కిచెన్‌గార్డెన్, కంపోస్టు పిట్, ఇంకుడుగుంత, స్వచ్ఛ పక్వాడ, ఆటసామగ్రి, ఫీల్డ్ ట్రిప్ తదితర పనులు ఏవీ నిర్వహించకుండానే దొంగ బిల్లులు సృష్టించి నిధులను కాజేస్తున్నా పట్టించుకునేవారు లేరు.


బిల్లు పొంది మరమ్మతులు చేయని కంపోస్టు పిట్

కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

కేంద్ర ప్రభుత్వం మంచి లక్ష్యంతో పీఎంశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టినా.. క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు ప్రధానోపాధ్యాయుల కారణంగా ఈ పథకం అభాసుపాలవుతోంది. పలువురు ప్రధానోపాధ్యాయులు నిధులను అడ్డగోలుగా కాజేస్తున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులను కల్పించి విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించాలని కేంద్రప్రభుత్వం ఎంతో పకడ్బందీగా తీసుకోచ్చిన పథకాన్ని సైతం దొంగబిల్లులు పెట్టి నిధులు కొట్టేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అలాంటి వారిపై చర్యలు తీసుకొని, పీఎంశ్రీ పథకం నిధులు సక్రమంగా వినియోగించే విధంగా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న దాతలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌లోని అతిపురాతనమైన శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో బుధవారం ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అవరణలో రెండు ధ్వజస్తంభాలతో పాటు నవగ్రహాలను ప్రతిష్ఠించారు. దాతలు యావాపురం శ్రీనాథ్‌రావు, తుడుగని రాజలింగం, చేదుళ్ల రాములు పంతులు, నవగ్రహాల ధాత మోత్కురి వాసుదేవశర్మలు ప్రత్యేక పూజలుచేసి ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అంబారిపేట రమాదేవి పాల్గొన్నారు.

దామర్‌చెడ్‌లో తుల్జా భవానీ జాతర

బషీరాబాద్: దామర్‌చెడ్‌లో శ్రీతుల్జా భవానీ మాత సహిత ఎల్లమ్మ దేవస్థానం జాతర బుధవారం ఘనంగా జరిగింది. పీఠాధిపతి బోయశ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పల్లకీసేవ కొనసాగించారు. మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నరేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

సంక్షిప్తంగా..

తండాలో తీవ్ర విద్యుత్ అంతరాయం

యాలాల: తమ తండాల్లో ప్రతిరోజు విద్యుత్ అతరాయం జరుగుతుందన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని తండావాసులు వాపోయారు. ముకుందాపూర్ తండాలో రెండు మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని అయితే ఒకదానికి మాత్రమే కరెంటు సరఫరా సౌకర్యం కల్పించారని తండాకు చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, సురేష్, పవన్, నార్యా నాయక్‌లు పేర్కొన్నారు. మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు రెండు సంవత్సరాలుగా కనెక్షన్ ఇవ్వలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

108 వాహనం తనిఖీ

ఘట్‌కేసర్:ఘట్‌కేసర్ 108 వాహనాన్ని బుధవారం జీవీకే సంస్థ ప్రతినిధులు తనిఖీ చేశారు. అన్నోజిగూడలోని సంస్కృతి టౌన్‌షిప్ చౌరస్తాలో ఉన్న వాహనంలోని పరికరాలను జీవీకే సంస్థ క్వాలిటీ విభాగం మేనేజర్, భూమా నాగేందర్ పరిశీలించారు.

బీసీలను మభ్యపెడుతున్న ప్రభుత్వం

కులకచర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసి బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతోందని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన కులకచర్లలో మాట్లాడారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

రోడ్డు మరమ్మతులకు స్థానికుల డిమాండ్


బుద్దారం వద్ద ఆందోళన చేస్తున్న యువకులు

పెద్దేముల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్లతో ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ బుద్దారం వంతెన సమీపంలో పెద్ద సంఖ్యలో యువకులు ధర్నా చేశారు. రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో తాండూరు-సంగారెడ్డి రోడ్డు లో గంటపాటు రవాణా వ్యవస్థ స్తంభించింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్దేముల్ మండలం బుద్దారం, గాజీపూర్ వంతెనల వద్ద పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే తాండూరు నుంచి కోట్‌పల్లి వరకు రోడ్డుమొత్తం పాడైంది. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని యువకులతో ధర్నా విరమింపజేశారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

బొంరాస్‌పేట్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలాంటిదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బొట్లవనితండా గ్రామ పంచాయతీలోని దేవ్లనాయక్ తండాకు చెందిన కమ్లిబాయికి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.79,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేశ్యనాయక్, మాజీ సర్పంచ్ మేఘ్యనాయక్, తండా నాయకులు గోపాల్‌నాయక్, సురేశ్‌నాయక్, శంకర్‌నాయక్, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి


నిరాహార దీక్షలో బీజేవైఎం నాయకులు

నవాబుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అధ్వానంగా మారిన రోడ్లను మరమ్మతులు చేపట్టాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. రోడ్లు బాగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● పలువురికి తీవ్రగాయాలు ● ఒకరి పరిస్థితి విషమం


దత్తు (ఫైల్)

తాండూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తాకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పలువురికి గాయాలు కాగా ఓ యువకుడి పరిస్థితి విషమంగా మారింది. ఈఘటన తాండూరు మండలం చంద్రవంచ గేటు సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రవంచ గ్రామానికి చెందిన ఆటోలో చింతలకాడి దత్తు, చింతలకాడి జగదీష్, చెలక జగదీష్, కుమ్మరి కాలేష్‌లు తాండూరుకు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నారు. చంద్రవంచ గేటు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే కరన్‌కోట్ వైపు నుంచి వస్తున్న పల్సర్ బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తాకొట్టింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న చింతలకాడి దత్తు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు గాయపడిన చింతలకాడి జగదీష్‌ను చికిత్స నిమిత్తం తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ప్రమాదంలో గాయపడిన కుమ్మరి కాలేష్‌ను కుటుంబీకులు తాండూరు పట్టణంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. పోలీసులు దత్తు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన బైక్‌పై వెళ్తున్న వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొడంగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కొడంగల్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ -2 సత్యనారాయణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని రెనివట్ల గ్రామానికి చెందిన గొల్ల మల్లప్ప(45) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం హైదరాబాద్ నుంచి కొడంగల్‌కు చేరుకున్న మల్లప్ప కొడంగల్‌లోని వర్షకాలనీలో ఓచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మల్లప్ప ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అప్పుల బాధతో కూలీ..

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ కూలీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌గఢ్‌లోని ధార జిల్లా జగన్నాథ్‌పూర్‌నకు చెందిన ఆత్మారామ్ (27)భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లోని ఓ డెయిరీఫాంలో కూలీ పనులు చేస్తున్నాడు. ఆత్మరామ్‌కు ఇటీవల అప్పుల బాధలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆత్మారామ్ బుధవారం సాయంత్రం డెయిరీఫాం పక్కన గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో డ్రైవింగ్‌తోనే ప్రమాదం

● మహిళ మృతికి కారణమైన నిందితుడి అరెస్టు

వికారాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం స్కూటీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓమహిళ మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కారణమైన నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు వెల్లడించారు. సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణానికి చెందిన తులసీరాం, భారతి(42) భార్యభర్తలు మంగళవారం అనంతగిరి నుంచి వికారాబాద్‌కు బైక్‌పై వస్తుండగా ఎస్‌పీ కళాశాల సమీపంలో వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో భారతి చికిత్స పొందుతూ మృతి చెందగా తులసీరామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారు అదేవేగంతో రోడ్డు పక్కన నిలబడిన చిన్న, లక్ష్మణ్, శ్రీనులపైకి దూసుకెళ్లగా వారికి గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కొత్తగడికి చెందిన ముత్తరగల్ల మహేశ్‌గా గుర్తించినట్లు తెలిపారు. ప్రమాదం అనంతరం పారిపోబోయిన కారు డ్రైవర్‌ను బీజేఆర్ చౌరస్తా వద్ద అప్రమత్తమైన ప్రజలు, పోలీసులు కలిసి పట్టుకున్నారని తెలిపారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం సేవించినట్లు గుర్తించినట్లు తెలిపారు. మద్యం మత్తులో కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని అతన్ని అరెస్టుచేసి బుధవారం జైలుకు తరలించినట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాతపడిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. ఎదులాబాద్‌కు చెందిన తోటకూర మల్లేష్ పాడిగేదెలు రోజూ మాదిరిగానే మేతకు తీసుకెళ్లాడు. బుధవారం సాయంత్రం గేదెలు ఇంటికి వస్తుండగా మైలార్ మల్లన్న ఆలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. రోజుకు ఆరు లీటర్ల పాలు ఇచ్చే పాడిగేదె మృతిచెందడంతో మల్లేష్ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గేదె విలువ రూ.లక్షా 30వేలు ఉంటుందని తెలిపాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

భూపతిరెడ్డి అవయవాలు దానం


భూపతిరెడ్డి (ఫైల్)

మేడ్చల్ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లి గ్రామానికి చెందిన భూపతిరెడ్డి(70) మృతిచెందగా ఆయన అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. నాలుగు రోజుల కిందట బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో భూపతిరెడ్డి తలపై తీవ్రగాయాలు కావడంతో బ్రేన్ డెడ్ అయింది. దీంతో కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆయన మంగళవారం మృతిచెందారు. దీంతో భార్య రామలక్ష్మి, కొడుకులు నరేందర్‌రెడ్డి, నవాజ్‌రెడ్డిలు భూపతిరెడ్డి కాలేయం, ఊపిరితిత్తులు, రెండు కిడ్నీలు దానం చేసినట్లు వివరించారు.

వినూత్న నిరసన


చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న నాయకులు

కొడంగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దంటూ కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినూత్న నిరసన చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం జేఏసీ నాయకులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ కో కన్వీనర్లు సురేశ్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, భీమరాజు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.